# అమాయకపు పిల్లలు

"అది కాదురా! చెప్పితే వినవ్వూ, పెట్టవ్వూ, మీకు చెరో తుపాకీ ఎందుకూ? ఈ దీపావళిపండుగ వెళ్లితే అవతల పారవేసేవేగా!!" అన్నాను నేను విసుగెత్తి.

"నా వొక్కడికీ వుంటే అన్నాయి లాక్కుంటాడు" అన్నాడు చిన్నవాడు.

"వీపు బద్దలుకొట్టనూ లాక్కుంటే—ఏంరా, లాక్కుంటావా?" అన్నాను పెద్దవాడితో.

"ఉహుఁ" అన్నాడు పెద్దవాడు.

"కాదులే నాన్నా! నువ్వులేనప్పుడు లాక్కుని లగెత్తుతాడు!" అన్నాడు చిన్నవాడు.

రెండుగంటలనించి వాళ్ళతో వాదించాను. లాభం లేకపోయింది. అదే అమాయకపు మొండిపట్టు—అవే సూటి సమాధానాలు! మన ఆధునిక రచయిత ఒకాయన రాసిన వ్యాసాన్ని సంగ్రహించి చిన్నచిన్న డోసులలో కమ్యూనిజాన్నికూడా ఎక్కించి చూశాను. కాని, మందు పనిచేయలేదు.

"ఇదిగోరా! మనకి రోలువుందికదా. నెలకి రెండుసార్లకంటే ఎక్కువ వాడతామా దాన్ని" అన్నాను ఇద్దరితో.

"ఉహుఁ" అన్నారు యిద్దరూ.

"మనకి అక్కరలేనప్పుడు అదే పదిమందీ వాడుకోవచ్చు కదూ?" అన్నాను మళ్ళీ.

"ఆఁ" అన్నాడు చిన్నవాడు.

"మరి ఇద్దరికీ ఒక్కనాడే కావలసివస్తే ఎలా నాన్నా?" అన్నాడు పెద్దవాడు.

"ఒకళ్ళు మానుకోవచ్చు" అన్నాను నేను.

"ఎవరు మానుకుంటారు?" అన్నాడు పెద్దవాడు.

"మనమే ఆగుదాం, ఏంపోయింది?" అన్నాను నేను.

"మన మెందుకు ఆగాలేం? రోలు మనది కాదూ?" అన్నాడు పెద్దవాడు.

"ఎందుకా? నీ మొహానికి! ప్రతిదానికీ కొక్కిరిస్తావు!" అని పెద్దవాణ్ణి గదిమి నోరుమూయించి, చిన్నవాడిని లాలించాను:—"ఏమిరా, తుపాకీ, బిళ్లలూ కొని ముందునీకిస్తాను, నీముందు అయిపోయినాక అన్నాయి కిచ్చెయ్యి, తుపాకీ, ఏం?" అన్నాను. చిన్నవాడు మాట్లాడలేదు, పెద్దవాడివంక చూశాడు 'చెప్పనా?' అన్నట్టు.

"ఏం? మరి వెళ్ళుదామా?" అన్నాను చిన్నవాడితో.

చిన్నవాడు చాలా సందేహిస్తూ అసలు రహస్యం బయట పెట్టాడు. "అదికాదు, నాన్నా! చెరో తుపాకీ ఉంటే చక్కగా ఒకళ్ళమీద ఒకళ్ళం కాల్చుకుని యుద్ధం చెయ్యవచ్చు" అన్నాడు అన్నాయి.

ఇదా కీలకం? పెద్దవాడికి తుపాకీ కొనిపెట్టమని చిన్నవాడు పట్టుపడుతూవుంటే మొదట నాకు ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే తనకున్న వస్తువుకూడా పెద్దవాడి చేతిలో ఇంకొకటివుంటే, చిన్నవాడు ఏడ్చి లాక్కునేవాడు. వాడిలో ఈ మార్పుకి, నాకు ఆర్థికంగా కొంత నష్టమైనప్పటికీ, లోలోపల నేను సంతసించాను. కాని, ఈ భ్రాతృస్నేహానికి

మూలం యుద్ధజ్వరమని ఇప్పుడు తేలింది! చిన్నవాడిలో దాగివున్న హింసాప్రవృత్తే ఈ విధంగా స్నేహరూపంతో బయటపడిం దన్నమాట! నాకిక ఎక్కువాలోచించటానికి మనస్సుపోలేదు. ఇద్దరూ కలిసి నామీద యుద్ధం ప్రకటించకముందే నేను బజారికి బయలుదేరాను, వాళ్ళను వెంటేసుకుని.

యుద్ధంమూలాన అసలే మందుసామాన్లధర విపరీతంగా పెరిగిపోయింది. పైగా ఈ సంవత్సరం లైసెన్సులు చాలా కొద్దిమందిమాత్రమే తీసుకున్నారు—విచారించగా వ్యాపారస్తులు తగ్గలేదుగాని, నలుగురైదుగురు కలిసి ఒక్కపేరుతో లైసెన్సు తీసుకున్నారని తేలింది. వాళ్ళల్లో ఈ సంఘీభావం ఎలా వచ్చిందో ఎందు కొచ్చిందో మనకి చెప్పినవాళ్లు లేరు. కాని వాళ్ళలోమాత్రం ఈ సంవత్సరం పోటీ లేదు.

వెంకయ్యదగ్గరే నేను నాకుకావలసిన సరుకులు కొంటూ ఉంటాను. నాకు అతనిమీద ఎక్కువ నమ్మకమో, అతనికి నామీద ఎక్కువ మక్కువో చెప్పటం కష్టం. కారణం వెంకయ్య నలుగురికీ అమ్మేధరకి నా కెప్పుడూ వస్తువు లమ్మడు. నాకు స్పెషలుధర అని ఇస్తాడు. నే నెప్పుడూ ఇంకోచోట విచారించను. కాని, ఇంకొకరిద్వారా తెప్పించుకుంటేమాత్రం, ఆ సరుకు నాణ్యం తక్కువో, లేక నిలవదో అనుకుంటాను, తక్కువధరకు వస్తూఉండేది.

వెంకయ్య ఈ సంవత్సరం లైసెన్సు తీసుకోలేదు, ఐనా నర్సయ్యకొట్లో కూర్చుని ఉన్నాడు. తుపాకీ ఇమ్మని అతన్నే అడిగాను, 'మనదగ్గర అయిపోయిన' వన్నాడు అతను.

పోతే మిగతా కావలసిన చిల్లరసామాన్లు తీసుకుని కుర్ర

వాళ్ళ కిచ్చి 'ధర ఎంత ఉంటుందీ?' అన్నాను, ఇంకొకళ్ళ దగ్గర మోసపోకుండా ఉంటానికి. తనదగ్గర లేని సరుక్కూడా వెంకయ్య ధర తగ్గించి చెప్పడని నా విశ్వాసం.

"నాలుగణాలుచేసే అమ్మేశాము" అన్నాడు వెంకయ్య.

వీటిమీద ఎంత ఖర్చు పెట్టవలసి ఉంటుందా? అని ఆలోచించుకుంటూ నేను బయలు దేరాను. ఒకటి, రెండు, మూడు షాపులు తిరిగాను. అంతా లే వనే చెప్పారు. ఒక్కొక్క కొట్టూ దాటిపోతున్నకుందికీ నాలో నిస్పృహ ఎక్కు వవుతున్నది. బుర్రలో ఎన్నో ఆలోచనలు, మెరుపులాగా మెరిసి పోతున్నై.

గాంధిగారు ఇంతకాలంనించీ అహింసా మహాత్మ్యాన్ని బోధిస్తున్నా, పిల్లలు తుపాకీలమీద ఎగబడుతున్నా రెందుకని? వారి సిద్ధాంతాలు పిల్లలదాకా పాకి ఉండకనా? లేక పెద్దవాళ్ళదగ్గరనించి నేర్చుకుని ఉంటారా? పెద్దలదగ్గర నేర్చుకుంటానికి మన మెన్నడూ తుపాకి కాల్చలేదు సరిగదా, చేత్తోపట్టుకునికూడా చూడలేదే! కాబట్టి మన దగ్గిరనించి నేర్చుకుని ఉండటం అసంభవం. మరి?–ఇంకోకొట్టు ఎక్కటంతో ఈ ఆలోచనాప్రవాహం తెగిపోయింది. కాని, నా ప్రశ్నకి ఎక్కడకూడా లేవనే జవాబొచ్చింది. అనవసరంగా ఇంతదూరం తిరిగినందుకు పిల్లలమీద విసుక్కుంటూ రోడ్డుమీదికి వచ్చాను. దుకాణాలముందు పెద్దవాడు చల్లగా జారుకున్నట్టు ఉన్నాడు ఎటో. కనపడలేదు, వాడికోసం ఆగాను. ఇంతలో వాడొక కుర్రవాణ్ణి వెంబడేసుకొచ్చి:

"నానా! ఈ అబ్బాయి తుపాకి అమ్ముతాడట" అన్నాడు.

"ఒక్క తుపాకీ ఏమి చేసుకుంటారు మీరు? వద్దులే" అన్నాను. పెద్దవాడు ఏడుపు మొహం పెట్టాడు. చిన్నవాడు శ్రుతిపెట్టుతున్నాడు. బజార్లో వాడు నలుగురికీ తన గానకళా కౌశలం ప్రదర్శించకముందే వాడిని వోదార్చి—ఇద్దరూ దానికోసం పోట్లాడుకోకుండా వంతులవారిగా వుపయోగించుకునే పద్ధతిలో సంధి కుదిర్చి—తుపాకీ బేరానికి పూనుకున్నాను. నిజంగా నాకు ఆకుర్రవాణ్ణి మోసపుచ్చాలని గానీ, వాడిదగ్గర అక్రమమైన ధరకు వస్తువు తీసుకోవాలని గానీ లేదు. కుర్రవాడివ్యాపారచాకచక్యం తెలుసుకుందామనే నాఅభిలాష. 'ఎంతకిస్తావబ్బాయీ, తుపాకీ?' అన్నాను నేను.

"పావలాకు కొన్నానండీ—" అన్నాడు వాడు.

నేను మధ్యనే-"పావలాకు కొంటే రెండుమూడురోజుల నించైనా వాడుకుని వుంటావు, పాతది ఎవరు కొంటారు? బేడ కిస్తావా?" అన్నాను.

"ఇప్పుడసలు దొరకటంలేదుకదండీ" అన్నాడు కుర్రాడు.

"దొరకకపోతే మా డబ్బులే మిగులుతై - మరీమంచిది! ఏం, నువ్వు కుర్రవాడివని ఇంకో అర్ధణా ఎక్కువిస్తాను. వొప్పుకున్నావా?" అన్నాను.

నేను ఈమాటలు అనేటప్పుడు ఎక్కడా నాకు తుపాకీ అవసరంవుందన్న భావం కనపడనీయలేదు. పిల్లల బలవంతాన నేను తుపాకీ కొంటున్నానని ఆ కుర్రవాడు గ్రహించాడని నాకు తెలుసు. ఐనా అతనికి నమ్మకం కలగకుండా వుంటానికి చిన్నవాడి చెయ్యిపట్టుకుని 'పదండిరా, ఇంకోచోట కొత్తదే కొనుక్కుందాము' అన్నాను. ఈ డాబుకూడా బాగా పని

చేసింది. కుర్రవాడు 'తీసుకో'మని తుపాకీ నాచేతికిచ్చాడు. బేడాఅర్ధణా కుర్రవాడికిచ్చాను. కుర్రవాడు అక్కడ వుండ లేదు ఇక-మిగతా అణాన్నర కొంచెం ఏడిపించి ఇద్దామను కున్నప్పటికీ! తుపాకీబిళ్ళలకోసం కొట్లోకివెళ్లాను. షాపతను 'అయిపోయినై' అన్నాడు. మళ్లీ ఒక్కొక్కకొట్టే ఎక్కుతూ వెంకయ్యకొట్టువరకూ వచ్చాను. ఎక్కడా బిళ్ళలు దొరక లేదు? 'మరి ఎట్లా నాన్నా?' అన్నాడు చిన్నవాడు. ఏం చెప్పేది వాడికి? నామనసప్పుడు సరియైన సమాధానం ఇచ్చే స్థితిలోకూడా లేదు. ఇంత ప్రపంచానుభవ మున్నవాడిని లోడితెడువెధవచేతిలో మోసపోతినే! పిల్లలేమనుకుంటారు? అనే నా ఆందోళన. పెద్దవాడివంకచూశాను. వాడిమొహాన విచారచిహ్న లేవీ లేకపోగా, నవ్వు నాపుకుంటున్నట్టుగా కన పడింది! ఎందుకు వీడికీ సంతోషం? చిన్నవాడికి తుపాకీ వుపయోగపడనందుకా?

"ఏం నాన్నా?" అన్నాడు చిన్నవాడు.

ఆ పిలుపుకు నాలో ఒక్క శృంగారం మినహాయించి, మిగతా రసా లన్నీ ప్రకోపించినై. వాళ్లని ఏమేమి అన్నానో నాకు ఒక్కటి కూడా జ్ఞాపకంలేవు! కాని చివరకి నేను చేసిందేమంటే—దాన దమన వినిమయ విక్రయాది సర్వ హక్కులతో ఆతుపాకీవాళ్ల కిచ్చి, వాళ్లని ఆమందుకొట్ల దగ్గరే వొదిలిపెట్టి ఇంటి కొచ్చేశాను.

అరగంటకల్లా ఇంటికి చేరుకున్నారు, కుర్రవాళ్లు— జేబులో చెరిబేడా గలగల్లాడించుకుంటూ!

---